క్లుప్తంగా

సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటుకు నగదు విరాళం



అల్లూరు: ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని ఇస్కపల్లిపాళెం ప్రాథమిక పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటుకు బీఎమ్మార్ చారిటబుల్ ట్రస్ట్ రూ.25వేలు నగదు విరాళాన్ని ప్రకటించింది.ఈ మొత్తాన్ని బీఎమ్మార్ కంపెనీ డైరెక్టర్ ఏ మురళి, బీద కుటుంబ సభ్యుడు బీద చైతన్య పాఠశాలకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ బీద మస్తాన్‌రావు ఆదేశాల మేరకు ఆయన స్వగ్రామంలోని పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటుకు నగదు విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. బీఎమ్మార్ కంపెనీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశభక్తి నాయకుల చిత్రపటాల బహూకరణ



వరికుంటపాడు: మండలంలోని గువ్వాడి పాఠశాలకు పూర్వ విద్యార్థి భోగినేని వంశీ శుక్రవారం దేశభక్తి నాయకుల చిత్రపటాలను బహూకరించారు. తన తాత భోగినేని వెంగయ్య జ్ఞాపకార్థంగా 20 చిత్రపటాలను అందజేశారు. హెచ్‌ఎం రామకృష్ణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భోగినేని మహేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘ ప్రతినిధిగా చందన్‌కుమార్

సంగం: ఆత్మకూరు నియోజకవర్గ సర్పంచ్‌ల ప్రతినిధిగా గాంధీజనసంఘం సర్పంచ్ మానికల చందన్‌కుమార్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం అందినట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనను నమ్మి ఆత్మకూరు నియోజకవర్గ సర్పంచ్‌ల ప్రతినిధిగా ఎంపిక చేసినందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో క్షయ వ్యాధిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏడీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ, కుష్ఠు నియంత్రణాధికారి వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కొండాయపాళెంలోని అబైడింగ్ హోప్ చర్చి వద్ద 25 మంది టీబీ రోగులు ఒక్కొక్కరికీ రూ.1500 విలువైన నిత్యావసరాలు, పౌష్టికాహార కిట్లను శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అజాగ్రత్త వహిస్తే కుటుంబసభ్యులకు సైతం సోకే ప్రమాదం ఉందని చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు. అబైడింగ్ హోప్ ట్రస్ట్ ఫౌండర్ నిర్మల్‌కుమార్, విశ్రాంత ఎస్సై ధర్మారావు, జిల్లా వైద్యశాఖ సిబ్బంది క్రాంతికుమార్, శివకుమార్, విజయ్, అష్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

బీవీనగర్‌లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. బీవీనగర్‌లోని కృష్ణమందిర సమీపంలో సుధాకరయ్య కుటుంబం నివాసం ఉంటోంది. తిరుపతిలో ఉంటున్న ఆయన మామ ఈ నెల 14న మరణించారు. పెద్ద కర్మ నిమిత్తం సుధాకరయ్య తన కుటుంబంతో కలిసి తిరుపతికి బుధవారం వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి గ్రిల్స్‌కున్న తాళాన్ని పగలగొట్టి బీరువాలోని 40 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు వెండి దీపపు కుందెలు, కాళ్ల పట్టీలను అపహరించుకెళ్లారు. ఇంటికి గురువారం రాత్రి చేరుకున్న బాధితుడు చోరీ విషయాన్ని నిర్ధారించుకున్నారు. అనంతరం వేదాయపాళెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తెలిపారు.

దేవాంగ వివాహ పరిచయ వేదిక రేపు

నెల్లూరు(వేదాయపాళెం): దేవాంగ వధూవరుల వివాహ పరిచయ వేదికను రామ్మూర్తినగర్‌లో ఆదివారం ఉదయం నిర్వహించనున్నామని దేవాంగ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 95533 93566 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అక్రిడిటేషన్ సాధనలో భాగస్వాములు కావాలి

నెల్లూరు (టౌన్): అంబేడ్కర్ విశ్వవిద్యాలయం న్యాక్ అక్రిడిటేషన్‌ను సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని రీజినల్ కో ఆర్డినేటర్ పిచ్చయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. న్యాక్ మెయిల్స్‌ను విద్యార్థులు రెండ్రోజులకోసారి పరిశీలించి సులువైన ప్రశ్నావళి సమాధానాలపై క్లిక్ చేసి సబ్మిట్ చేయాలని కోరారు. అభ్యాసకుల సేవా కేంద్రానికి ఆదివారం హాజరుకావాలని సూచించారు

క్షతగాత్రులకు మానవత్వంతో సాయం చేయాలి

కావలి రూరల్: ప్రతిఒక్కరూ మానవత్వంతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడాలని కావలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు కోరారు. పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీలో రోడ్డు భద్రతా వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంవీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగంగా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా దాదాపు గంటకు 16 మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు సత్వరమే వైద్యం అందించడం ద్వారా విలువైన ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ప్రదాత చట్టం ప్రకారం రోడ్డు ప్రమాద బాధితులకు సేవలందించే వారికి తగిన ప్రోత్సాహం లభిస్తుందన్నారు. సహాయకులు ఎలాంటి విచారణలకు హాజరవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు ప్రదాత చట్టంపై అవగాహన పెంచుకుని క్షతగాత్రుల ప్రాణాలను కాపాడాలని కోరారు. కావలి డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కల్పించడంతో పాటు వైద్యపరీక్షలు, కుటుంబానికి కౌన్సెలింగ్, ప్రథమ చికిత్స, రక్తదాన శిబిరం, ఉత్తమ డ్రైవర్లకు సత్కారం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ కేవీఆర్ బాబు, గ్యారేజ్ ఇన్‌చార్జి ఖాజామోహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి: రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎంఈ డీ సురేష్

ఆర్టీసీ డ్రైవర్లు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి: ఆర్టీసీ డ్రైవర్లు విధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉండి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని మెరిట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎం మనోజ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు ఆర్టీసీ సహాయ మెకానికల్ ఇంజినీర్ డీ సురేష్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రతతో నడపాలన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. డ్రైవింగ్‌లో మెళకువలు పాటించాలన్నారు. మానవతప్పిదాలతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఉదయగిరి డిపోను ప్రమాదరహితంగా నిలిపేందుకు డ్రైవర్లు కృషి చేయాలన్నారు. డీఎం ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు నారాయణరావు, ఎల్‌హెచ్ రమణయ్య, ఎం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కావలిరూరల్: రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సుందరరావు

అనధికారిక లేఅవుట్లకు జరిమానాలు

కలిగిరి: పంచాయతీ అనుమతులు లేకుండా వేసే అనధికారిక లేఅవుట్లకు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని కావలి డీఎల్‌పీఓ ఎస్ ఆదినారాయణ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెలాఖరులోగా నూరు శాతం ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. జగనన్న స్వచ్ఛసంకల్పం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మికంపోస్టును తయారు చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయాన్ని పాటించాలన్నారు. ప్రతి సచివాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించే స్పందనలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఫీల్డ్‌వర్క్ సాకుతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఎంపీడీఓ ఆర్ కళాధర్ రావు, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కావలి డీఎల్‌పీఓ ఆదినారాయణ

అంగన్‌వాడీలు సమయాన్ని పాటించాలి

ఉదయగిరి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమయాన్ని పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను సూచించారు. మండలంలోని వెంగళరావు నగర్‌లో గండిపాళెం సెక్టార్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది హాజరుకు సంబంధించిన ఫేస్ యాప్‌పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలు నెలాఖరు నుంచి ఫేస్‌యాప్ ద్వారా హాజరు వేయాల్సి ఉన్నందున దానిపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ప్రీస్కూల్ చిన్నారుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ షాను

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

జలదంకి: బాలికలు ఉన్నత విద్యనభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీవీ సుభాషిణి అన్నారు. బ్రాహ్మణక్రాక గిరిజన కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో కిశోర బాలికలు, తల్లిదండ్రులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బాలికా విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గిరిజ కాలనీలోని బాలికలు అధిక శాతం కోలాటం పేరుతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువును నిర్వీర్యం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తల్లిదండ్రులు గమనించి బాలికలను చదువుకు దూరం కాకుండా చూడాలని కోరారు. అనంతరం బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, బాలికా విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు అంగన్‌వాడీ వర్కర్లు అరుణ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.



బాలికా విద్య అవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుభాషిణి

ఉపాధి లక్ష్యాలను సాధించాలి

అల్లూరు: ఉపాధి హామీ పథకం లక్ష్యాలను క్షేత్రస్థాయి సిబ్బంది సాధించాలని జిల్లా విజిలెన్స్ అధికారి వీ సురేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యలయంలో ఉపాధి సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరిగిన, జరుగుతున్న ఉపాధి పనులపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా ఖచ్చితత్వంతో పని చేయాలన్నారు. కూలీలకు లక్ష్యం మేరకు పనిదినాలు కల్పించాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి సిబ్బందికి సూచనలు ఇస్తున్న విజిలెన్స్ అధికారి సురేష్‌బాబు

గ్యాస్ ఏజెన్సీలో తనిఖీలు

ఉదయగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీని సివిల్ సప్లయిస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ బాలాజీసింగ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఉదయగిరి, సీతారాంపురం మండలాల పరిధిలో దీపం గ్యాస్ కనెక్షన్ల వివరాలు, గత కొన్ని నెలలుగా గ్యాస్ సరఫరా నిలిచిపోవడానికి కారణాలను సివిల్ సప్లయిస్ డీటీ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ పరిధిలో 1200 దీపం కనెక్షన్లు ఉన్నాయన్నారు. రెండ్రోజుల్లో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. ఆయన వెంట డేటాఎంట్రీ ఆపరేటర్ అంజాద్ ఉన్నారు.

రామాలయ జీర్ణోద్ధరణకు నిధుల మంజూరు

ఆత్మకూరురూరల్: దేపూరులోని పురాతన కోదండరామస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు దేవాదాయ శాఖ రూ.23 లక్షలు మంజూరు చేసింది. ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు గతంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ క్రమంలో ఏడాది క్రితం శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని కూల్చివేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి దేవాదాయశాఖ ద్వారా ఆలయ జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేయించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సులభరీతిలో బోధన చేయాలి

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సులభరీతిలో బోధన చేయాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని ఉర్దూ బాలికల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీ, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చతుర్విధ ప్రక్రియలలో నైపుణ్యాలు పెంపొందేలా పరిసరాలను పరిచయం చేస్తూ బోధన చేయాలని సూచించారు. విద్యార్థులు వర్క్‌బుక్‌లు పూర్తిచేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యతతో వడ్డించాలని సూచించారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



రైతులకు తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్న ఏడీ దేవసేనమ్మ

సోమశిల: తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయశాఖ ఆత్మకూరు ఏడీ దేవసేనమ్మ సూచించారు. అనంతసాగరం మండలం కొత్తపల్లిలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ పీ శ్రీధర్‌రెడ్డితో కలిసి వరి పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

చేజర్ల: ఆదూరుపల్లిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఆదూరుపల్లిలోని మూడు దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేసి గోదాముల్లోని స్టాక్‌ను పరిశీలించారు. ఎరువుల స్టాక్‌లో తేడాలు ఉండడంతో అమ్మకాలు నిలుపుదల చేశారు. ప్రిన్సిపల్ సర్టిఫికెట్(పీసీ) లేని రూ.2,34,460 లక్షల విలువైన మందుల అమ్మకాలను నిలుపదల చేసినట్లు విజిలెన్స్ సీఐ పెంచలరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటరెడ్డితో పాటు మండల వ్యవసాయాధికారి శశిధర్ పాల్గొన్నారు.



ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు

చేజర్ల: గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ విజయలలిత పేర్కొన్నారు. ఏటూరు సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వంపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. వలంటీర్లు సచివాలయం పరిధిలోని సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐసీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడిగా సురేంద్రబాబు

నెల్లూరు(బారకాసు): ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా సురేంద్రబాబును నియమించారు. నగరంలోని ఇన్‌ఫెంట్ జీసస్ సెంటర్‌లో ఏఐసీఎఫ్ రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు విజయరాజు హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రకుమార్, కోశాధికారిగా మార్టిన్, కమిటీ సభ్యులను నియమించారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులు నాగేంద్రకుమార్, వెంకటనాథ్, రెవరెండ్ రాజశేఖర్, నేతలు డేవిడ్ దయాసాగర్, రాజశేఖర్ దాసరి, ఎలీషాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ అధికారులకు అభినందనలు

ఆత్మకూరురూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా అవార్డులు అందుకున్న జలవనరుల శాఖ అధికారులను ఆ శాఖ ఆత్మకూరు ఈఈ రాపూరు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు. ఆత్మకూరు డీఈ లీలాకుమారి, నెల్లూరు డీఈ కేఎస్ రమేష్, పొదలకూరు డీఈ విజయ భాస్కర్‌రెడ్డి, అల్లూరు ఏఈ జలీల్ అహ్మద్, బిట్రగుంట ఏఈ ఎన్ జితేంద్రరెడ్డి, నారాయణరెడ్డిపేట సెక్షన్ ఐసీ అసిస్టెంట్ కే వెంకట సుబ్బయ్య, తదితరులకు అభినందనలు తెలిపారు.



దాతకు సన్మానం



ఆత్మకూరు: ఇటీవల పట్టణంలో జరిగిన పలు క్రీడల నిర్వహణకు సహకారం అందించిన దాత డాక్టర్ జే ప్రణీత్‌ను క్రీడా ఆర్గనైజింగ్ కమిటీ శుక్రవారం ఘనంగా సన్మానించింది. రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలతో పాటు క్రికెట్ పోటీలకు సాయం అందించడంపై పట్టణంలోని ఆయన నివాసం వద్ద శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ తిరుపతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాయపడిన చిన్నారికి ఆర్థిక సాయం

ఆత్మకూరు(అనుమసముద్రంపేట): ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి పడి గాయపడిన చిన్నారి చికిత్స కోసం ఏఎస్‌పేట దర్గా ఉపపీఠాధిపతి ఎస్‌జీఎస్ జునైద్‌పాషా తన వంతు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన దంపతులు దర్గా దర్శనానికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. వారి కుమార్తె మెట్ల మీద నుంచి కిందపడడంతో తీవ్రంగా గాయపడింది. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో విషయం తెలుసుకున్న దర్గా ఉపపీఠాధిపతి జునైద్ పాషా రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దర్గా సిబ్బంది, యాత్రికుల నుంచి మరో రూ.22,375 సేకరించి అందజేశారు. ఏఎస్‌పేట మండల కోఆప్షన్ సభ్యుడు సందానీబాషా రూ.5 వేలు అందజేశారు. దీంతో తల్లిదండ్రులు చిన్నారిని నెల్లూరులోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

సంగం: మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ అప్పాజీని శుక్రవారం ఘనంగా సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడంతో ఈఓపీఆర్డీని మండల పరిషత్ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

మర్రిపాడు : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న ఎంపీడీఓ నాగమణి, కంపసముద్రం డిజిటల్ అసిస్టెంట్ గౌస్‌ను మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ సిబ్బంది, బ్రహ్మణపల్లి మాజీ సర్పంచ్ కన్నపరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మండల తహసీల్దార్ సానా శ్రీనివాసులరెడ్డిని పలువురు శుక్రవారం ఘనంగా సన్మానించారు. శకునాలపల్లి సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లూరి కృష్ణారెడ్డి, ఇత్తడి రమణయ్య, తదితరులు శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఆత్మకూరురూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహం, డీటీ రాజేష్, సర్వేయర్ శాంత, ఈ డివిజనల్ మేనేజర్ ఆర్‌ఎస్ రాజు, వీఆర్‌ఏ నారాయణకు పలువురు శుక్రవారం అభినందనలు తెలిపారు. అలాగే కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఖాజాషరీఫ్, 9వ తరగతి విద్యార్థి యోహాన్ సందీప్, మేఘన, తదితరులు వివిధ విభాగాల్లో ప్రతిభచూపి కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకోవడంపై ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. హెచ్‌ఎం తోట శ్రీనివాసులు మాట్లాడుతూ కలెక్టర్ నుంచి పురస్కారాలు పొందిన విద్యార్థులకు త్వరలో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.



ఉత్తమ సేవాపురస్కారం అందుకున్న ఆత్మకూరు తహసీల్దార్ లక్ష్మీనరసింహం



అవార్డులు అందుకున్న కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



సంగం : ఈఓపీఆర్డీ అప్పాజీకి సత్కారం



మర్రిపాడు ఎంపీడీఓకు సత్కారం



ఉదయగిరి తహసీల్దార్‌కు సత్కారం

కొండచిలువ కలకలం



ఆత్మకూరురూరల్: మహిమలూరు చెరువులోకి వేటకు వెళ్లిన జాలర్ల వలలో శుక్రవారం కొండచిలువ చిక్కుకుంది. దాన్ని గమనించిన జాలర్లు భయంతో అటుగా వెళ్తున్న కరటంపాడు వలంటీర్ వంగపాటి వెంకటేష్‌కు తెలియజేయగా, కరటంపాడు గ్రామస్తులకు ఫోన్ చేసి పిలిపించి వారి సహకారంతో వలతో పాటు కొండచిలువను గ్రామంలోకి తీసుకెళ్లారు. అనంతరం కొండచిలువను వల నుంచి తప్పించి గోనె సంచిలోకి పంపించే క్రమంలో మింగిన పిల్లిని విసర్జించడంతో స్థానికులు ఒకింత భయాందోళనకు గురయ్యారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా అనంతసాగరం డీఆర్వో ఖాజా తన సిబ్బందితో కొండచిలువను స్వాధీనం చేసుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

లారీ బోల్తా

సంగం: మండలంలోని సిద్దీపురం వద్ద నెల్లూరు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఓ లారీ శుక్రవారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు.